సాక్షి
వికారాబాద్

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



అవగాహన తప్పనిసరి

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలని మున్సిపల్ డీఈ మణిపాల్ సూచించారు. 8లో▸



క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిబా అన్నారు. 8లో▸



ప్రభుత్వం విఫలం

ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్ ఆరోపించారు. 9లో▸

న్యూస్‌రీల్

మొండి బకాయిల వసూలుకు చర్యలు

జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్రరావు



మాట్లాడుతున్న ఓఎస్‌డీ సూర్యచంద్రరావు

బంట్వారం: దీర్ఘకాలిక రుణాలు తీసుకొని చెల్లించని వారిపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు హైదరాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జాయింట్ రిజిస్ట్రార్ (ఓఎస్‌డీ) సూర్యచంద్రరావు తెలిపారు. సోమవారం బంట్వారం సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సంఘం పరిధిలో రూ.5.32 కోట్ల రుణాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. మొండి బకాయి దారులకు మొదటగా నోటీసులు జారీ చేసి కొంత సమయం ఇస్తామన్నారు. వారి నుంచి స్పందన లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించకుంటే వడ్డీ ఎక్కువ పడుతుందన్నారు. తీసుకున్న రుణాలను వాయిదాల పద్ధతిలో చెల్లిస్తే ఎలాంటి నష్టం ఉండదన్నారు. కార్యక్రమంలో సేల్స్ ఆఫీసర్ డీఎల్ఎన్ రెడ్డి, మోమిన్‌పేట్ బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి, సీఈఓ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కు పదోన్నతి

తాండూరు రూరల్: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కు పదోన్నతి లభించింది. డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రదీప్ హైదరాబాద్ జిల్లాకు డీటీగా వెళ్లారు. బదిలీపై వెళ్తున్న ఆయన్ను సోమవారం తహసీల్దార్ తారాసింగ్ తోపాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

పరిగి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి ప్రభుత్వాతన్ని డిమాండ్ చేశారు. సోమవారం పరిగి పట్టణంలో పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా రాంచంద్రయ్య, యాదయ్య, చంద్రయ్య, మల్లయ్య, జంగయ్య, రాములు, నజీర్, గఫార్, నర్సింహులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎంతో మంది నిరుపేదలు ఇళ్లు లేక రోడ్డు పక్కన జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పలు గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్, సురేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

యాచారం: ఫార్మాసిటీకి పరిహారం అందజేసి సేకరించిన భూముల సర్వేకు రైతులు సహకరించాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. యాచారం మండలం పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో అధికారులు చేపట్టిన రైతుల కబ్జా భూముల సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు.



ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

రక్షాబంధన్

వికారాబాద్ పట్టణంలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రక్షా బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణరెడ్డి తోపాటు పలువురు ఉన్నతాధికారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. – అనంతగిరి



లక్ష్యానికి మించి..

ఆయిల్ పామ్ సాగుపై రైతుల ఆసక్తి

- ఈ ఏడాది సాగు లక్ష్యం 2వేల ఎకరాలు
- ఇప్పటికే టార్గెట్ పూర్తి
- ముందుకొచ్చిన 2,300 మంది రైతులు
- 90శాతం రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా..



ఇటీవల కొత్రెపల్లిలో ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న మంత్రి తుమ్మల, స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్: ఆయిల్ పామ్ సాగుకు జిల్లా రైతాంగం ఆసక్తి చూపుతోంది. ఈ పంట సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి, లాభాలు ఉండటంతో ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పెద్ద మొత్తంలో రాయితీలు ఇస్తోంది. భవిషత్ అవసరాలు, ఆయిల్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఉద్యాన వన శాఖ అధికారులకు లక్ష్యం నిర్దేశించింది. ఇన్నాళ్లు ఈ పంట సాగుపై రైతులకు అవగాహన లేకపోవడంతో ముందుకు రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రోత్సాహం, రాయితీలు కల్పిస్తుండటంతో అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌ను ఉద్యాన వన శాఖ పూర్తి చేసింది. ఇటీవల వికారాబాద్ మండలం కొత్రెపల్లి శివారులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ రాష్ట్ర డైరక్టర్ హాస్మిన్‌బాషా, డిప్యూటీ డైరక్టర్ నీరజ ఆయిల్ పామ్ మొక్కలు నాటి రైతులకు అవగాహన కల్పించారు.

35వేల ఎకరాల్లో అనుకూలం

జిల్లాలో 5.61 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతుండగా ఇందులో 50 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగుచేస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు అవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం జిల్లాల వారీగా లక్ష్యాలను విధించింది. వికారాబాద్ జిల్లాలో 35 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు నేలలు అనుకూలంగా ఉన్నాయని ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఏడాది జిల్లాలో కనీసం 2వేల ఎకరాల్లో పంట సాగు చేయాలని లక్ష్యం పెట్టుకొగా అది పూర్తయ్యింది. 2వేల మంది రైతులు సాగుకు సుముఖంగా ఉన్నట్టు తెలిసింది. లక్ష్యానికి మించి మరో 300 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

రాయితీతో..

ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. ఐదెకరాల వరకు సాగుచేసే సన్న, చిన్నకారు రైతులకు 90శాతం రాయితీపై మొక్కలు అందజేయనుంది. 90శాతం రాయితీపై డ్రిప్‌పైపులు కూడా అందజేస్తారు. పంట దిగుబడి ప్రారంభమయ్యే వరకు అంతర పంటలు సాగుకు ఎకరాకు ఏడాదికి రూ.2100 చెల్లిస్తారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు మొక్కలతోపాటు డ్రిప్ పరికరాలను ఉచితంగా ఇస్తారు. 9 ఎకరాల నుంచి 12 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగు చేసే రైతులకు 80 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

ఏడాదికి రూ.2.5 లక్షల ఆదాయం

ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక పంట. మూడున్నర సంవత్సరాల నుంచి పంట ప్రారంభమై ఐదు సంవత్సరాలకు అమ్మాకినికి వస్తుంది. అప్పటి నుంచి 35 సంవత్సరాల పాటు ఏడాదికి ఎకరాకు 10 నుంచి 16 టన్నుల దిగుబడి వస్తుంది. దాదాపు రూ.2.5 లక్షల ఆదాయం చేకూరుంది. ఎకరం పొలంలో 57 మొక్కలు మాత్రమే నాటుకోవాల్సి ఉంటుంది. అంతర పంటలుగా శ్రీగంధం, సర్వి, ఉల్లి, కూరగాయల పంటలు సాగు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవాలి



ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల రైతులు తమను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. రైతు వాటా ఎకరాకు రూ.1,750 చొప్పున ఎన్నిఎకరాలు ఉంటే అంత డబ్బు డీడీ రూపంలో తీసి ఇవ్వాలి. నీట సౌకర్యం ఉన్న రైతులే దరఖాస్తు చేయాలి.తాండూరు సమీపంలోని కోకట్ నర్సరీలో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే కంపెనీలతో రైతులను టయ్యప్ చేస్తాం.

– సత్తార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి



మోమిన్‌పేట్ కళాశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నాణ్యమైన విద్యనందించాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- వికారాబాద్, మోమిన్‌పేట్ జూనియర్ కళాశాలల్లో తనిఖీ

అనంతగిరి/మోమిన్‌పేట్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ లెక్చరర్లకు సూచించారు. సోమవారం వికారాబాద్, మోమిన్‌పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఏఏ సబ్జెక్టులు ఎంత వరకు పూర్తయ్యాయని ఆరాతీశారు. ఆతర్వాత సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పెండింగ్ పనులు ఉంటే సత్వరం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆదేశించారు. అనంతరం మోమిన్‌పేట్ పశు వైద్యశాలను తనిఖీ చేశారు. ఒక్కరే విధుల్లో ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.శంకర్ నాయక్, వికారాబాద్ ఎంపీడీఓ వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు, మోమిన్‌పేట్ ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సత్వరం పరిష్కరించాలి

ప్రజా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 147 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాత్రలు వేద్దాం.. 'నులి'మేద్దాం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకటి నుండి 19 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలందరికీ విధిగా అల్బెండజోల్ మాత్రలు వేయించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 11న అల్బెండజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ మాత్రలపై అవగాహన కల్పించి, వందశాతం లక్ష్యం పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీత, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, డీఈఓ సుశీందర్‌రావు పాల్గొన్నారు.

ప్రజావాణికి 82 ఫిర్యాదులు

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



అల్బెండజోల్ మాత్రలు ప్రదర్శిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

ఉపాధి కోసం డీఈఈటీ

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)ను ప్రారంభించిందని, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఈఈటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రైవేట్ సంస్థల్లో నిరుద్యోగ యువతకు నిరంతర ఉపాధి కల్పించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఆధారితమైన డీఈఈటీ వెబ్‌సైట్‌ను గత సంవత్సరం డిసెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు. నిరుద్యోగులు ఈ వెబ్‌సైట్‌లో ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు వారి నైపుణ్యాలు, విద్యార్హతలు, నివాస ప్రాంతం మొదలైన వాటి ఆధారంగా ఉద్యోగ సమాచారం అందించబడుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ఆమోదించకుంటే ఉద్యమం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

కడ్తాల్: 42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యవర్గ సభ్యుడు కందుకూరి జగన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో సోమవారం ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. తక్షణమే బీసీ రిజర్వేషన్లను ఆమోదించి అమలు చేయాలని లేని పక్షంలో బీసీ సామాజికవర్గాన్ని ఐకమత్యం చేసి, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకోసం మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ సామాజికవర్గ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ శివశంకర్, నాయకులు శివగల రమేశ్, గుమ్మడి కరుమయ్య పాల్గొన్నారు.

నేటినుంచి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నినిక్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ కోర్సుల్లో మొత్తం 45 సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. పదో తరగతి పాసైన వారు, పాలిటెక్నినిక్ అర్హత పరీక్ష రాసిన వారు సర్టిఫికెట్లతో కళాశాలలో ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలన్నారు. ఈ నెల 11న మూడు కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇతర వివరాలకు సెల్ నబంర్ 94901 20175లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'కాణిపాక' సన్నిధిలో బీఎంఆర్

తాండూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే జన్మదినం కావడంతో కుటుంబ సమేతంగా పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో కాణిపాక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణమలై(అరుణచలం) పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. మంగళవారం అరుణచలంలో గిరిప్రదీక్షణ చేయనున్నారు.



కాణిపాక ఆలయంలో బీఎంఆర్ దంపతులు

సర్వం సిద్ధం

- చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు ఏర్పాట్లు పూర్తి
- ప్రభుత్వానికి చేరిన అంచనాలు
- ఉత్తర్వులు రావడమే ఆలస్యం
- జిల్లాలో మొత్తం చెరువులు 1,179
- ఎంపిక చేసినవి 778
- వదలాల్సిన చేపపిల్లలు 1.29 కోట్లు
- మత్స్య సహకార సంఘాలు 152



వికారాబాద్: జిల్లాలోని చెరువులు, కుంటల్లో చేప పిల్లలు వదిలేందుకు మత్స్య శాఖ కసరత్తు చేస్తోంది. వందశాతం రాయితీతో ప్రభుత్వం వీటిని పంపిణీ చేస్తుంది. ఇటీవల ఇందుకు సంబంధించిన నిధులు కేటాయించినా ఉత్తర్వులు మాత్రం విడుదల కాలేదు. ఏ సమయంలోనైనా ఆదేశాలు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. చేప పిల్లలు వదిలేందుకు అనువైన చెరువులను ఎంపిక చేశారు. ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసిన ఆ శాఖ జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక అంజేశారు. ప్రస్తుతం టెండర్లు పిలవాల్సి ఉంది. అయితే ఎప్పటిలోగా చేపపిల్లలు వదులుతారనే విషయంపై స్పష్టత లేదు. జిల్లాలో మొత్తం 1,179 చెరువులు, కుంటలు ఉండగా 778 చెరువుల్లో చేపపిల్లలు వదలాలని నిర్ణయించారు. ఈ ఏడాది 1,29,72,000 చేప పిల్లలు, 14.97 లక్షల రొయ్య పిల్లలు వదలాలని లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లాలో 152 మత్స్య సహకార సంఘాలు.. 5,665 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు చేరుతుండటంతో ఈ నెల నుంచే చేప పిల్లలు వదిలే ప్రక్రియ ప్రారంభించాలని మత్స్య సహకార సంఘాల సభ్యులు కోరుతున్నారు. అలాగే చెరువులకు సరిపడా చేప పిల్లలు పంపిణీ చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

లక్ష్యానికి దూరంగా..

చెరువుల్లో చేపపిల్లలు వదిలే విషయంలో అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి వదులుతున్న దానికి ఏ మాత్రం పొంతన ఉండటం లేదు. ఏటా ఇదే తంతు కనిపిస్తోంది. ఎంచుకున లక్ష్యంలో 60 నుంచి 70 శాతం వరకే చేపపిల్లలు వదిలి చేతులు దులపుకొంటున్నారు. ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో చెరువులు పూర్తి స్థాయిలో నిండేవి. ఈ ఏడాది ఇప్పటికే అన్ని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ ప్రక్రియను ప్రారంభించపోవడంతో చాలా మంది మత్స్యకారులు బయట కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకోవాల్సి వస్తోంది.

నాసిరకం పిల్లలు

ఏటా ప్రభుత్వం వదులుతున్న చేపపిల్లల్లో ఎక్కువ శాతం నాసిరకంగానే ఉంటున్నాయి. సాధారణంగా చెరువుల్లో వదిలే సమయంలో మూడు నుంచి నాలుగు ఇంచులు ఉండాలి. కానీ ఒక్క ఇంచుకు మించి ఉండటం లేదు. గతేడాది దోమ మండలం మోత్కూర్ చెరువులో చేపపిల్లలు వదిలేందుకు అధికారులు వచ్చారు. నాసిరకంగా ఉండటంతో మత్స్యకారులు అధికారులతో గొడవకు దిగారు. నాలుగు సార్లు చేప పిల్లలను తిరిగి పంపారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చేప పిల్లల లెక్కల్లో తేడా ఉందని అంటున్నారు. లక్ష పిల్లలు వదిలామని చెబుతున్నా అందులో 50 వేలు కూడా ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు దృష్టిసారించి నాణ్యమైన చేపపిల్లలు వదలడంతోపాటు లెక్క కూడా సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే..



జిల్లాకు ఎన్ని చేపపిల్లలు అవసరం అనే దానిపై అంచనాలు సిద్ధం చేశాం. ప్రభుత్వానికి నివేదిక కూడా పంపాం. ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం. ఆదేశాలు అందిన వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి చెరువులు, కుంటల్లో చేప పిల్లలు వదులుతాం.

– వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



నర్సింలుగౌడ్‌ను సన్మానిస్తున్న వెంకట్రాములుగౌడ్ తదితరులు

బొంరాస్‌పేట: జాతీయ ఉపాధిహామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్‌ను పలువురు నాయకులు, ఆయా సంఘాల సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో కోస్గి ఏఎంసీ మాజీ చైర్మన్ ఏర్పుమళ్ల వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, గౌడసంఘం మండల నాయకులు ప్రకాశ్‌గౌడ్, భీమయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులున్నారు.

భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ

ఎంఈఓ చంద్రప్ప



ఫిజియోథెరపీ చేయిస్తున్న వైద్యులు

బంట్వారం: వారానికోసారి నిర్వహించే ఫిజియోథెరపీకి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను తల్లిదండ్రులు తప్పక తీసుకురావాలని కోట్‌పల్లి ఎంఈఓ చంద్రప్ప అన్నారు. సోమవారం భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు డాక్టర్ శ్రీకాంత్ ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సుమారు 20 మందికి పైగా పిల్లలకు ఫిజియోథెరపీ చేయించామన్నారు. వీరికి ప్రతిరోజు తరగతులు ఉంటాయన్నారు. వారానికోసారి ఫిజియోథెరపీ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి తీసుకురావాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ స్పెషల్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీకాంత్, ఐఈఆర్పీ దిలీప్‌కుమార్, సీఆర్పీ నర్సింలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

380 మందికి ఉచిత పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవీందర్ యాదవ్

తాండూరు టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ అర్బన్ పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 380 మంది పేషంట్లు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. డీఎంహెచ్‌ఓ లలితాదేవి ఆదేశానుసారం ఏర్పాటు చేసిన ఈ శిబిరం విజయవంతమైంది అన్నారు. 62 మందికి ఆపరేషన్ల నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశామన్నారు. వీరికి వారం రోజుల్లో ఆపరేషన్లు పూర్తి చేస్తామన్నారు. అనంతరం పేషెంట్లకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు గిరిధర్, అక్షయ్, అఖిల్ ఖాన్, రాధ, రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

భర్తపై కేసు

మొయినాబాద్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై మొయినాబాద్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎనికేపల్లి గ్రామానికి చెందిన చీపిరి రాజుకు 2012లో నాగిరెడ్డిగూడకు చెందిన సరితతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సరితకు మరో ముగ్గురు అక్కాచెల్లెల్లు ఉన్నారు. సోదరులు లేకపోవడంతో పుట్టింటి నుంచి భూమి, ఇల్లు ఇప్పించాలని రాజు కొన్నేళ్లుగా భార్యను వేధిస్తున్నాడు. అతని బాధ భరించలేక కొంత కాలం క్రితం 6 గంటల భూమి ఇచ్చారు. అయినా ఇల్లు కావాలంటూ ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో గత ఆదివారం సరిత పుట్టింటికి వెళ్లిపోయింది. రాత్రి అక్కడికి చేరుకున్న రాజు భార్యపై దాడిచేశాడు. దీంతో సోమవారం ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో నిందితుడికి ఇరవై ఏళ్ల జైలు

ఆమనగల్లు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా ఓ బాలికకు దగ్గరై మోసం చేసిన వ్యక్తికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లుకు చెందిన వెంకటేశ్‌పై 2021లో పోక్సో కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన షాద్‌నగర్ పోక్సో కోర్టు నిందితుడికి పైశిక్ష విధిస్తూ తీర్పు వెలువర్చింది. గతంలో ఇక్కడ పనిచేసిన డీఎస్పీ కుషాల్కర్, ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్, కోర్టు కానిస్టేబుల్‌లు యాదయ్య, జగన్ నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించారు.

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు శివాలయాలకు పోటెత్తారు. ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

- వికారాబాద్ నెట్‌వర్క్



ధారూరు: కుంకుమార్చన చేస్తున్న మహిళలు



ధారూరు: మహాగణపతి పూజలో భక్తులు



అనంతగిరి: బుగ్గ రామలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



తాండూరు టౌన్: నీలకంఠేశ్వరుడిగా దర్శనమిస్తున్న స్వామివారు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని ముజాహిద్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా అన్నారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న నరేశ్ ఈ నెల 2, 3 తేదీల్లో చైన్నైలోని రామకృష్ణ పాలిటెక్నిక్ కాలేజ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలలో ప్రతిభను కనబరిచాడు. ఈ మేరకు ఆయన్ను జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం నరేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



నరేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా

పీఆర్టీయూతోనే సమస్యలకు పరిష్కారం

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్

పూడూరు: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పూడూరు, సోమన్‌గుర్తి, కేజీబీవీ, పెద్ద ఉమ్మెంతాల్ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంలో సంఘం కృషిని వివరించారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం తీసుకువచ్చేందుకు శక్తి వంచన లేకుండా పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, ప్రవీణ్‌కుమార్, కిష్టయ్య, శివయ్య, మాణిక్‌చారి, యాదయ్య, శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

తాండూరు రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో గ్రామానికి చెందిన 151 మందికి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రేషన్‌కార్డు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, పీసీసీ మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు ప్రవీణ్ కుమార్, జితేందర్‌రెడ్డి, విద్యాసాగర్, ఆనంద్‌చారి, షబ్బీర్, నర్సింలు, ఫయాజ్, మల్లేశం, ఇక్బాల్, మినహాజ్, బుజ్జమ్మ, ఎర్రబాలప్ప, శంకర్‌నాయక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

బొంరాస్‌పేట: ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రేషన్‌కార్డులను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. బురాన్‌పూర్, తుంకిమెట్ల తదితర గ్రామాల్లో లబ్ధిదారులు కార్డులు అందుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, గౌడ సంఘం మండల నాయకులు ప్రకాశ్‌గౌడ్, భీమయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులున్నారు.



తాండూరు రూరల్: రేషన్‌కార్డు లబ్ధిదారులతో ధారాసింగ్ తదితరులు



బొంరాస్‌పేట: రేషన్‌కార్డు మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

తాండూరు మున్సిపల్ డీఈ మణిపాల్

తాండూరు టౌన్: పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పట్టణ మున్సిపల్ డీఈ, ఇంచార్జి కమిషనర్ మణిపాల్ సూచించారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పాత తాండూరులోని ప్రభుత్వ నెంబర్–2 పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. ఇళ్లు, పాఠశాల, మైదానం వంటి ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లోని పూల కుండీల్లో, టైర్లలో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. ఇంటిలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి, మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోతే ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగుతూ వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడంతో పాటు ఇంట్లో వారికి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ గౌడ్, పాఠశాల హెచ్‌ఎం ప్రతిభా భారతి, వార్డు ఆఫీసర్లు కార్తీక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేయాలి

పరిగి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని గంగపుత్ర కాలనీలో వందరోజుల ప్రణాళికలో భాగంగా ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు రోజు తడి చెత్తను పొడి చెత్తను వేరు వేరుగా వేయాలని సూచించారు. చెత్త సేకరణకు ప్రతి రోజు వాహనాలు వస్తున్నాయని వాటిలోనే చెత్తను వేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ్ పాల్గొన్నారు.



తాండూరు టౌన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మణిపాల్



పరిగి: పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వెంకటయ్య

ఘనంగా వీడ్కోలు సమావేశం



జంగయ్య దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనంతగిరి: విధి నిర్వాహణలో ప్రజలతో మమేకమై పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ అన్నారు. వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జంగయ్య సోమవారం ఉద్యోగ విరమణ సందర్భంగా కార్యాలయ ఆవరణలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, డీఈ రాకేశ్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన బీసీ నాయకులు



దుద్యాల్: పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో వెంకటయ్య



యాలాల: ఛలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరిన నాయకులు



అనంతగిరి: వికారాబాద్ నాయకులు

దుద్యాల్: కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఈ మేరకు మండలంనుంచి పలువురు బీసీ నాయకులు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి సోమవారం ఢిల్లీకి పయనమయ్యారు. మండల కేంద్రానికి చెందిన మెరుగు వెంకటయ్య కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, బీసీ సంఘం జిల్లా ముఖ్య నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన మీనాక్షి నటరాజన్‌తో కలిసి ట్రైన్‌లో ఢిల్లీకి బయలుదేరారు. ఆయన వెంట కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీసీ నాయకులు ఉన్నారు.

అనంతగిరి: బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధనకై కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీలో చేపడుతున్న ధర్నా కార్యక్రమానికి వికారాబాద్ ప్రాంతం నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సోమవారం బయలుదేరారు. హైద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో వీరంతా పయనమయ్యారు. రిజర్వేషన్‌ల సాధనకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రత్యేక రైలులో ప్రయాణం

యాలాల: 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు సాధనలో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సోమవారం మండల నాయకులు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, ముదిరాజ్ సంఘ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ హన్మంతు, నాయకులు మహిపాల్ తదితరులు ఢిల్లీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో బయలుదేరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

దుద్యాల్: బైక్ అదుపుతప్పడంతో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆలేడ్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని కుదురుమల్లకు చెందిన శివగల్ల కృష్ణ దుద్యాల్ గేట్ నుంచి కుదురుమల్లకు తన బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన గ్రామస్తులు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

కేసు నమోదు

మొయినాబాద్: అక్రమంగా తమ భూమిలోకి చొరబడి దాడి చేసిన వ్యక్తులపై ఓ రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం పొద్దటూరుకు చెందిన గొండ్ల కిష్టగౌడ్‌కు మొయినాబాద్ మండలం చిన్నమంగళారం రెవెన్యూలోని సర్వేనంబర్ 604లో 5.10 ఎకరాల భూమి ఉంది. సుమారు యాభై ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం 9 గంటల సమయంలో చేవెళ్లకు చెందిన కొజ్జంకి దుర్గప్రసాద్ మనుషులు 15మంది, రెండు కార్లలో వచ్చి భూమిలో చొరబడి సర్వే చేయిస్తున్నారు. వీరి వద్దకు వెళ్లి ఎవరని ప్రశ్నించిన కిష్టగౌడ్‌ను బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

శంకర్‌పల్లి: డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన వసంత్‌కుమార్(18) డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. గత నెల 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా, బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఎంలు



తాండూరు రూరల్: బాలయ్యకు స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న మహిళా సమాఖ్య అధికారులు

తాండూరు రూరల్: తాండూరు మండల నూతన ఏపీఎంగా బాలయ్యను జిల్లా అధికారులు నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఐకేపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఏపీఎం ఆనంద్ బంట్వారం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. మహిళ సంఘాల బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం ఏపీఎంను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి నాగమ్మ, సీసీలు శంకర్, సంధ్య, ప్రభు, వెంకటయ్య, అరవింద్‌కుమార్, అనసూయ, అకౌంటెంట్ కవిత పాల్గొన్నారు.

కుల్కచర్ల ఏపీఎంగా శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: మహిళ సంఘాల ఉన్నతికి అధికారులు నిస్వార్థంగా పనిచేయాలని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంతోష అన్నారు. సోమవారం కుల్కచర్ల నూతన ఏపీఎంగా శ్రీనివాస్‌రెడ్డి పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న శోభ బదిలీపై దోమ మండలానికి కేటాయించగా.. పరిగి ఏపీఎంగా శ్రీనివాస్‌రెడ్డి కుల్కచర్లకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఏపీఎంను మహిళా సమాఖ్య అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీబీకేలు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

విధుల్లో చేరిక..

యాలాల: ఐకేపీ ఏపీఎంగా శ్రీనివాస్ సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ప్రమీల జనగాం జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆమె స్థానంలో చౌడాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను యాలాలకు కేటాయించారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఐకేపీ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు.

దళితవాడకు అడ్డంగా కంచె



కంచె వద్ద ఆందోళన వ్యక్తంచేస్తున్న దళితులు, గ్రామస్తులు

రాకపోకలకు అవస్థలు పడుతున్నామని బాధితుల ఆందోళన

షాద్‌నగర్ రూరల్: తమ కాలనీకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా కొందరు వ్యక్తులు కంచె వేశారని ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల దళితవాడకు చెందిన బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తులు, దళితుల కథనం ప్రకారం.. బూర్గుల గ్రామంలోని సర్వేనంబర్ 130లో స్వాతంత్ర్య సమరయోధుడు బూర్గుల నర్సింగ్‌రావు స్థానిక అవసరాల నిమిత్తం యాభై ఏళ్ల క్రితం ఎకరా పది గుంటల భూమిని కేటాయించారు. ప్రస్తుతం ఇది పశువుల మంద స్థలంగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. గ్రామం కోసం కేటాయించిన ఈ భూమిలో కొంతమంది నిరుపేద దళితులు పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన స్థలంలో పంచాయతీ తరఫున బోర్లు వేసి గ్రామానికి నీటి సరఫరా అందించడంతో పాటు పశువుల కోసం నీళ్ల తొట్టి నిర్మించారు. ఇళ్లు కట్టుకున్న దళితులు ఈ భూమిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 130లోని 20 గుంటల భూమి మాదేనంటూ బూర్గుల నర్సింగ్‌రావు బంధువు ఆ స్థలం చుట్టూ ఇనుప కంచె వేశారు. దీంతో ఇళ్లకు వెళ్లే దారి లేక ఇబ్బంది పడుతున్నామని దళితులు తెలిపారు. ఇటీవల ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి సంబంధించిన సామాగ్రిని తరలించేందుకు కొంత కంచెను తొలగించాడు. ఈ విషయం తెలుసుకున్న సదరు వ్యక్తులు తనకు ఫోన్ చేసి బెదించారని తెలిపాడు. బూర్గుల నర్సింగ్‌రావు ఆశయ సాధనకు కృషి చేయాల్సిన వారి కుటుంబ సభ్యులే ఇలా దళితులను చిన్నచూపు చూస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న దారిని మూసేసి కంచె నిర్మించడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై బాధితులు పోలీసులు, పంచాయతీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

- హాజరుకానున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నారని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జ్ కేఎల్లార్ తెలిపారు. మల్లాపూర్‌లోని యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఫంక్షన్ హాలులో కొనసాగుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి 12 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని స్పష్టంచేశారు. లబ్ధిదారులు విధిగా హాజరై కార్డులు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నవారు మల్లారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'డబుల్ ఇళ్లు' స్థానికులకే ఇవ్వాలి

తుక్కుగూడ: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూంల పనులను పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. వీటి పంపిణీలో స్థానికులకే మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కేఎల్లార్